క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం గుడివాడ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక జగన్నాథపురంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల్లో కస్సంశెట్టి విజయ్‌కుమార్ వితరణతో పుస్తకాలు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో బత్తుల ప్రసాదు, జె. తాతారావు, బొగ్గారపు తిరుపతయ్య, ఎ. బాలాజీ, పాఠశాల హెచ్ఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



పామర్రు: రాజమహేంద్రవరంలోని శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం వారు గత నెల్లో నిర్వహించిన అంతర్జాతీయ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పోటీల ఫలితాలు వచ్చాయని, వీటిలో ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థిని షహీదున్నీసా విజేతగా నిలిచారని ప్రి న్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏఎస్ఎం హైస్కూల్లో బుధవారం విజేతను అభినందించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ



గుడ్లవల్లేరు: కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని గుడ్లవల్లేరు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇమ్రాన్ ఏఓ నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియామకమైన తర్వాత కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు.

కూచిపూడి కార్యదర్శిగా సోమేశ్వరరావు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని కూచిపూడి పంచాయతీ కార్యదర్శిగా మొవ్వ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు (పూర్తి అదనపు బాధ్యతలు)కు ఇస్తూ ఎంపీడీఓ డి.సుహాసిని బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కూచిపూడి కార్యదర్శిగా పనిచేస్తున్న కే పుష్పనాదం జూన్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయడంతో ఈయన్ను నియమించినట్టు ఆమె ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం



మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం సత్కరించారు. ఇక్కడ మాదిరిగా ఆయా స్కూళ్లలో కూడా మంచిగా పాఠాలు చెప్పాలని ఆకాంక్షించారు. సర్పంచ్ మెండా ర్యూన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్ బాబు, విద్యాకమిటీ మాజీ చైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయ గణపతికి పూజలు



కొమరవోలు(పామర్రు): కొమరవోలు శివారు గాంధీ ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయ గణపతి ఆలయంలో ఆషాఢ మాసం బుధవారం పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు సింగవరపు సుధాకర్‌బాబు తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

పామర్రు: స్థానిక చౌదరిపేటలో ఉంటున్న యలమంచిలి నాగ వెంకటలక్ష్మీప్రసన్న గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని ఆమె భర్త వాసిరెడ్డి హర్షవర్ధన్ స్థానిక స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. 29 ఏళ్ల వయసున్న నాగ వెంకటలక్ష్మీప్రసన్న గత నెల 30వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లింది. ఇప్పటివరకు తిరిగి రాలేదు. దీంతో అన్నిచోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు పోలీసులకు 94407 96431కు ఫోన్ చేయాలని కోరారు.

రహదారులు అస్తవ్యస్తం

పట్టించుకోని పాలకులు, అధికారులు



తక్కెళ్లపాడులో రోడ్డుపై నిలిచిన వర్షం నీటితో ఇక్కట్లు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు రోడ్లు తటాకంలా మారాయి. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రహదారులను అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆచరణలో నామమాత్రంగా కూడా ఆ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ప్రయాణం అంటే భయం

మండలంలోని కొల్లేటి గ్రామాల్లో రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. ఎన్ని అవసరాలు ఉన్నాగానీ, కొన్ని సార్లు రావడానికి రహదారి సౌక్యం లేక పనులను వాయిదా వేసుకున్న సంఘటనలు ఉంటున్నాయి. జిల్లా కేంద్రమైన ఏలూరు, మండల కేంద్రమైన మండవల్లి రావాలంటే అస్తవ్యస్త రహదారుల వలన మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. అధికారులు రహదారుల విషయంలో పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రహదారులను అభివృద్ధి చేసి తమ వాగ్దానాలను నెరవేర్చుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

ఏన్నో ఏళ్ల నుంచి మా గ్రామంలోని రహదారుల అభివృద్ధిని ఏ అధికారి పట్టించుకోలేదు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు చెరువుల మాదిరిగా మారుతున్నాయి. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి

–బీఆర్ సతీష్, తక్కెళ్లపాడు

కూటమి నాయకులు మాట నిలబెట్టుకోవాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి. మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే రోడ్లు అధ్వానంగా ఉంటే.. ఇక ముందు పడే వర్షాలకు ప్రజలు ఎలా తట్టుకుంటారో తెలియడం లేదు.

–బొమ్మబోయిన గోకర్ణయాదవ్, మండవల్లి

ఉచిత దంత వైద్యానికి విశేష స్పందన



కట్టుడు పళ్ల సెట్లను అందుకున్న పేషెంట్లతో డాక్టర్ బండారు, వైద్యులు, సిబ్బంది

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం సింగలూరులో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత దంత వైద్యానికి విశేష ప్రజా స్పందన లభించింది. బుధవారం స్థానిక భాగ్య విదాత చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో రిమూవబుల్ కంప్లీట్ డెంచర్(తీసి పెట్టుకునే పూర్తి పళ్ల సెట్)లను ఉచితంగా అవసరమైన పేషెంట్లకు అందించారు. గుంటూరు సిబార్ దంత వైద్య కళాశాల రజతోత్సవ వేడుకల్లో భాగంగా సింగలూరు బండారు బ్రహ్మారావు, సీతా మహాలక్ష్మి మెమోరియల్ కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుంటూరు సిబార్ డెంటల్ వైద్య విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్నె ప్రకాష్, హెచ్ఓడీ డాక్టర్ కడియాల కృష్ణకిషోర్‌తో పాటు వైద్యులు, సిబ్బంది 30మందికి పైగా ఈ వైద్య సేవలను అందించారు. గ్రామ కార్యదర్శి చాపరాల రాజేష్, గుడ్లవల్లేరు సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు తేజోన్మయి ఎంపిక



గన్నవరం: జాతీయ స్థాయి ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు స్థానిక చైతన్య స్పోర్ట్ క్లబ్‌కు చెందిన కోట తేజోన్మయి ఎంపికైనట్లు ఆ క్లబ్ ప్రధాన కార్యదర్శి ధనియాల నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలోని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్–12 విభాగంలో తేజోన్మయి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 5వ తేదీ నుంచి జరిగే జాతీయ పోటీల్లో తేజోన్మయి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు క్రీడా ప్రముఖులు అభినందించినట్లు నాగరాజు తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు



కోరుకొల్లులో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కలిదిండి(కైకలూరు): గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని కలిదిండి ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర తెలిపారు. పంచాయతీరాజ్ కమిషన్ ఆదేశాల మేరకు కలిదిండి, కోరుకొల్లు గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, డంపింగ్ యార్డులను బుధవారం పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కలిదిండిలో 600 టన్నులు, కోరుకొల్లులో 200 టన్నుల చెత్త ఉన్నట్లు గుర్తించి, నివేదిక అందించామన్నారు. సేకరించిన చెత్తను ఏ విధంగా భూస్థాపితం చేయాలనే అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. అదేవిధంగా కైకలూరు మండలంలోని రాచపట్నం, వరహాపట్నం గ్రామాల్లోనూ పేరుకుపోయిన చెత్తను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలిదిండి సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, పంచాయతీ ఈఓ రాగాల ఉదయ్‌కుమార్, సచివాలయ సెక్రటరీ రాజేశ్వరీ, సిబ్బంది జ్యోతి, శాంతి, బుజ్జి, శ్రీను పాల్గొన్నారు.

10వ రోజుకు చేరిన ధర్నా

మండవల్లి: పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటును నిలుపదల చేయాలని, మెరక చేసి తమ భూములు అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. లబ్ధిదారులు నిర్వహిస్తున్న ధర్నా బుధవారం పదో రోజుకు చేరింది. ఏలూరు జిల్లా సీపీఎం కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాదు మద్దతు ప్రకటించారు. జి.పద్మ, వై.సింహాచలం, లక్ష్మీసునీత, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



నూతన అధ్యక్షుడిగా బ్యాడ్జ్ అందుకుంటున్న హనుమకుమార్

కూచిపూడి(మొవ్వ): సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని తహసీల్దార్ కే మస్తాన్ ఆకాంక్షించారు. కూచిపూడి రోటరీ క్లబ్ 2025–26 పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని మొవ్వ మండలం కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో బుధవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా జొన్నలగడ్డ హనుమకుమార్, కార్యదర్శిగా బీహెచ్‌బీఆర్ ఎస్ సాయి, కోశాధికారిగా బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కూచిపూడి రోటరీ జిల్లాలో అతి చిన్న క్లబ్బు అయినా ప్రతి సంవత్సరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎం.రమణమూర్తి, ఇమ్మీడియట్ ఫాస్ట్ ప్రెసిడెంట్ కోనేరు మంజునాథ్, బాధ్యతలు చేపట్టిన అధ్యక్ష కార్యదర్శులు జొన్నలగడ్డ హనుమకుమార్, బీహెచ్‌వీఆర్ ఎస్ సాయి, కూచిపూడి సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



పోరంకిలో టీబీ వ్యాధి పై అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు

పెనమలూరు: టీబీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాజా అన్నారు. పోరంకిలోని 4వ సచివాలయంలో ప్రధాన మంత్రి టీబీ ముక్తి భారత్ కార్యాక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజా మాట్లాడుతూ వారం రోజులుగా కళ్లెతో దగ్గు ఉన్న వారు పరీక్ష చేయించుకోవాలని సూచించారు. 60 సంవత్సరాలు పైబడిన వారు షుగర్ ఉన్నా, కళ్లె వస్తున్న వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. శరీర బరువు తగ్గినా, రోగ నిరోధక శక్తి తగ్గినా టీబీ వ్యాధి సోకే ప్రమాదముందని స్పష్టం చేశారు. మండల పరిధిలో 72 మంది టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. మందులు సకాలంలో వాడితే టీబీ తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ధ్వంసం



రోడ్డుపై తిరుగుతున్న దమ్ము ట్రాక్టర్



రోడ్డుపై పడిన మట్టి

మొవ్వ: అధ్వానంగా మారిన రోడ్లపై పలు ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో ఇష్టా రాజ్యంగా తిరుగుతున్నాయి. దీంతో రోడ్లు మరింత దెబ్బతింటున్నాయి. మొవ్వ మండలంలో ప్రధాన రహదాలే కాక గ్రామాలను కలిపే రహదారులపై ప్రయాణం ప్రమాదంగా మారింది. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో పొలాల్లో దమ్ము చేసిన ట్రాక్టర్ అదే చక్రాలతో రోడ్లపై మట్టిని జల్లుకుంటూ, మట్టి సుద్దలుగా వేసుకుంటూ వెళుతున్నాయి. ఈ దమ్ము చక్రాలతో రోడ్లకు మరింత నష్టం వాటిల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు, వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి దమ్ము చక్రాలతో రోడ్లపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెట్టుబడుల ఆకర్షణ అవసరం



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గుడివాడ టౌన్: వ్యాపార అంశాల్లో పెట్టుబడుల ఆకర్షణ ఒక కళ వంటిదని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ట్రెనర్ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఏఎన్నార్ కళాశాల ఎంబీఏ విద్యార్థులకు పెట్టుబడులు ఆకర్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలివైన పెట్టుబడిదారుడు ఏయే రంగాల్లో పెట్టుబడి పెట్టాలనేది, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గణించాలనేది చూస్తారన్నారు. యువత పెట్టుబడి రంగంలో ప్రాముఖ్యత సాధించాలన్నారు. మనం చేసే వ్యాపారం, పెట్టుబడులు మన ఆర్థిక అభివృద్ధితో పాటు పలువురికి ఉపాధి కల్పన, రాష్ట్ర అభివృద్ధి వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ హెచ్ఓడీ డాక్టర్ ఎంబీ సువర్చల తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల వద్ద డ్రోన్ కెమెరాల నిఘా



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

పామర్రు: బాలురు, బాలికలు వాహనం నడుపుట, ఈవ్ టీజర్స్‌కు సంబంధించి విద్యాసంస్థలు, కళాశాలల వద్ద డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, జుఝవరంలోని ఉషోదయ స్కూల్ వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిఘాలో భాగంగా కొంతమందిని అదుపులోకి తీసుకుని వారికి తగిన వయస్సు రాకుండా వాహనం నడిపితే ఏ విధమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందో వివరించామన్నారు. వాహన చట్టాల గురించి తెలియజేశామన్నారు. స్కూల్స్ , కళాశాలల వద్ద వాహనాలను అతివేగంగా నడుపుతూ విద్యార్థులకు ఇబ్బందికరంగా తిరుగుతున్న వారిని గుర్తించి వారిని హెచ్చరించామన్నారు. మొదటి తప్పుగా భావించి వారిని విడిచి పెట్టినట్లు తెలిపారు. మండలంలోని హైస్కూల్స్, జూనియర్ కళాశాలల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



స్టాపర్లను ఏర్పాటు చేసిన దృశ్యం

నందివాడ: మండలంలోని జనార్దనపురం శివారు గుడివాడ నుంచి హనుమాన్ జంక్షన్ వెళ్లే రోడ్డుపై బుధవారం రోడ్డు ప్రమాదాలు నివారణకు పోలీసులు స్టాప్ బోర్డ్స్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. జనార్దనపురం, పుట్టగుంట తదితర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా దీపక్ నెక్స్‌జెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తోపాటు దాతల సహకారంతో స్టాప్ బోర్డ్స్, రేడియం స్టిక్కర్లతో కూడిన డ్రమ్ములు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు గుర్తుంచుకోవాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



కొండిపర్రులో పొలంపిలుస్తోంది కార్యక్రమం

కొమరవోలు(పామర్రు): వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏఓ శివనాగరాణి పేర్కొన్నారు. మండలంలోని కొండిపర్రు, రిమ్మనపూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో తొలుత నారుమడులు పోసుకునే ముందు విత్తనాల శుద్ధిని తప్పక చేసుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించి నారుమళ్లకు సరైన పోషణ అందించాలన్నారు. అప్పుడే పంట ఏపుగా పెరుగుతుందన్నారు. నారుమళ్లలో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అధిక మోతాదులో యూరియా తదితరాలను వాడకూడదని సూచించారు. నారుమళ్ల ఏపుగా పెరిగిన తర్వాత మాత్రమే నాట్లు వేయాలన్నారు.

విలీనంతో విద్యార్థుల అవస్థలు

కూటమి ప్రభుత్వ నిర్వాకమే కారణం



విలీనమైన వణుదుర్రు యూపీ స్కూల్

ముదినేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వ నిర్వాకం కారణంగా మండలంలోని పేద విద్యార్థులు చదువు కోసం అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నూతన బడుల వ్యవస్థ పేరుతో యూపీ స్కూళ్లను విలీనం చేయడంతో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.

విలీనం ఇలా..

ముదినేపల్లి మండలంలో 11 యూపీ స్కూళ్లున్నాయి. వీటిలో రెండింటిని హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి, మిగిలిన తొమ్మిది పాఠశాలలను దూరంలో ఉన్న హైస్కూళ్లల్లో విలీనం చేశారు. మండలంలోని చేవూరు, కాకరవాడ, కోడూరు, దాకరం, చిన్న కామనపూడి, కొరగుంటపాలెం, వణుదుర్రు, దేవపూడి వాడవల్లి పాఠశాలలున్నాయి. ఇప్పటివరకు ఈ పాఠశాలల్లో 8వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. విలీనం కావడంతో 6, 7, 8 తరగతులు రద్దయ్యాయి.

దూరాభారం

విలీనమైన పాఠశాలల్లో 200మంది వరకు 6,7, 8 తరగతులు చదివే విద్యార్థులున్నారు. ప్రస్తుతం వీరంతా గ్రామాలకు దూరంగా ఉన్న హైస్కూళ్లకు వెళ్లాల్సిన అగత్యం ఏర్పడింది. సొంత గ్రామాలకు 5 నుంచి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూళ్లకు వెళ్లాలంటే దూరాభారంగా మారడంతో పాటు సరైన రవాణా సౌకర్యాలు లేవు. కోడూరు పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాలపర్రు లేదా ముదినేపల్లి హైస్కూళ్లకు వెళ్లాలి. దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు.



కోడూరు పాఠశాల్లో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

ఏకపక్ష నిర్ణయాలు

పాఠశాలలు విలీనం చేసే ముందు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్య కమిటీలను సంప్రదించకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారనే విమర్శలున్నాయి. దీనిపై ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ స్థానిక ప్రజాప్రతినిధులు గతంలో జరిగిన మండల సమావేశంలో నిరసన తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఇటీవలనే ఫిర్యాదు చేసి యూపీ స్కూళ్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు ఎలాంటి నివేదిక కలెక్టర్‌కు అందజేస్తారనే ఉత్కంఠ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొంది.

అవగాహనతో విద్యుత్ ప్రమాదాల నివారణ



జాతీయ విద్యుత్ వారోత్సవాల ర్యాలీలో మాట్లాడుతున్న ఈఈ కృష్ణనాయక్

ఉయ్యూరు: విద్యుత్ ప్రమాదాలను అవగాహనతోనే నివారించవచ్చని ఆ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ అన్నారు. జాతీయ విద్యుత్ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఉయ్యూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కృష్ణనాయక్ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ లైన్లు తెగిపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ పరికరాల వినియోగం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉంటే ప్రమాదం దరిచేరదని చెప్పారు. సౌరవిద్యుత్ వినియోగంతో విద్యుత్ ఆదా, వృథాను అరికట్టవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాల వినియోగం దేశ ప్రగతి దోహదపడుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో డీఈఈ హేమకుమార్, ఏఈ బసవ శాస్త్రులు, సిబ్బంది పాల్గొన్నారు.